*కలెక్టర్ హోదాలో వున్న కొడుకు, వేయిమైళ్ళ దూరంనించీ, చేయందుకునేంత చేరువకు వస్తే సంతోషమే! అయితే ఆదినారాయణయ్యకు. అది "ఓ జీవితకాలం లేటు" కల! ఆ మనిషి బాధ ఆకం చెరువు గట్టునున్న మర్రిచెట్టుకే తెలుసు*

తిరణాలకు వెళ్ళే జనంతో క్రిక్కిరిసిపోయిన రైలుపెట్టెలోంచి. తను బయట పడేప్పటికి. ప్రాణాలు 'కడ' బట్టాయి. ఆదినారాయణను. ఆ స్టేషన్‌లో రైలుఆగేది ఓ నిముషమే కాబట్టి. హడావిడిపడి. గుడ్డ గోచీ జారుచ్చుకుని. జనం త్రోపులో. "బ్రతుకు జీవుడా" అని బయటపడ గలిగేటప్పటికి గగనమయింది ఆయనకు ప్లాట్‌ఫారంమీద పడి తల బొప్పిగట్టడం వెంట్రుక వాసిలో తప్పిపోయింది మరి!

"హమ్మయ్య!" అని నిట్టూర్చి. "పోయిన" ప్రాణాలను కూడదీసుకుని ఓ క్షణం నిర్విణ్ణుడయి నిల్చున్నాడు. మరో క్షణం....మరో క్షణం....మరికాస్తేపు.

స్టేషన్‌లోకి అడుగు వెయ్యబోతూ. వుత్తినే వెనక్కి తిరిగి చూశాడు. క్షణంలో వెళ్ళిపోతుందనుకున్న రైలు కదలలేదు! గంట కొట్టనూ లేదు.

"పెరుగుబండి క్యాసింగు వుండది. అప్పుడే బండిపోదు; ఆల్చెం వుండది. తాయిగా యెక్కండి బండి!" అంటూ పోర్టరు కాబోలు సావధానపరుస్తున్నాడు జనాన్ని.

ఆదినారాయణ దృష్టి అట్లా. అట్లా.... కొత్తగా రంగువేసిన పరుపుల పెట్టెమీదికి పోయింది- ఫస్ట్‌క్లాస కంపాట్‌మెంటు కాబోలు. ఒకటో-నెంబరు వేసుంది మరి! ఓ మాంచి జాతిబొమ్మలా. ఆటగుర్రంలా వున్న ఆడకూతురు. పక్కపెట్టెలో కొట్టుకుఛస్తోన్న గుంపును ఛీత్కారంగా చూస్తూ. ఇంగ్లీషులో ఏవేవో నోటచేసుకుంటుంటే. కడాకు తనకు వినపడిన. తెలిసిన తెలుగుముక్కలు....

"ఛీ!.... వరిగొడ్లు, పశువులు, చూడు, బాట్:"

కోడెగాడులా పక్కనేవున్న పెనివిటికి కాబోలు చూపిస్తూ అంది. తోటే, బుట్ట బొమ్మల్లాంటి ఇద్దరు పిల్లలు వింతగా సర్కసుచూసినట్టు చూస్తున్నారు జనాన్ని.


"వీళ్ళ నలుగురికే కాబోలు పెద్ద పెట్టంతా! ఎంతైనా పెట్టిపుట్టిన మారాజులు! ఎవరో! ఎక్కడికి వెడుతున్నారో! ఎంత అదృష్టవంతులో కదా! అనుకుంటూ వెనక్కు మళ్ళీ స్టేషన్‌లోకి వెళ్ళబొయ్యాడే కానీ, అడుగుపడలేదు తనకు.

ఎత్తుగా, సింహాసనంలాంటి పరుపుల సీట్లతో రంయిమని తిరిగే పంఖాలతో. ఇంద్రభవనంలా వుంది ఆ పెట్టె తన కళ్ళకు.

"ఆఁ....ఆఁ....అట్లా కాస్త ఓ క్షణం. ఓ ముహూర్తం. అట్లా ఆ పరుపుల పెట్టెలో నడుం ఆనించగలిగితే పాదం మోప గలిగితే యెంత బావుణ్ణు!...."

పసివాడిలా అయిపోయి వాంఛా మోహితుడయి యంత్రవతుగా. ఆ ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంటువేపు నడిచి ఓ క్షణం నయన సుఖాన్నైనా పొందాలని నిలబడ్డాడో లేదో.

"ఏయ్ అబ్బీ! ఏం లేదు పో, పో!....ఏం పనిలేదుమీకు! అంటూ ఆ ఆటగుర్రంలాంటి



మానవతి తన్ను వెళ్ళగొట్టబోతున్నప్పటికిగాని, ఆయన ఈ లోకంలో పడలేదు.

ఆవిడ మాటల్లోని భయంకరమైన ఇంగితాన్ని తలచుకుని ఓ క్షణం వణికిపొయ్యాడు ఆదినారాయణ. కడాకు సంబాళించుకుని.

"అవును, ఇప్పుడేగా రైలుపెట్టెలోంచి బయటపడ్డాను! నా అవతారం చూసి ఆ బిడ్డ అట్లా అనుకున్నా తప్పులేదు" అనుకుంటూ ఛప్పున వెనక్కు తిరిగాడాయన.

టిక్కెట్టిచ్చి, స్టేషనులోంచి బయట పడేటప్పటికి, మూడు క్రోసుల దూరం వున్న తన వూరికి గతుకుల మట్టిరోడ్డు మీదగా వెళ్ళే ఒకే ఒక జట్కాబండి "మిగిలి"పోయింది. ఇంత రొష్టూ పడిన తరువాత వూరికి నడిచివెళ్ళే ఓపిక కనపడ లేదు ఆయనకు. కిం కర్తవ్యం? దూరాన లీలగా తన వూరి "గుర్నాధం చెరువు" మీద వున్న ఊడలమర్రి. "ఎందుకు ఆలోచిస్తావు? రా!... రా!....కాలు సాగించు. తప్పదు. రా!.... అంటూ పిలుస్తోన్నట్లయింది. "అవును త్వరగా కొంప చేరుకోవాలి. ఢిల్లీలో అబ్బాయినుంచి వుత్తరం వచ్చి వుంటుంది" అనుకుంటూ జవసత్త్వాలుడిగిన తన రెండు కాళ్ళను కాసేపు నిమురుకుని. బుజ్జగించుకుని బయలుదేరాడు ఆదినారాయణ.

మాంచి ఎండాకాలం: రోహిణీకార్తె తాలూకు వడమటి గాలి ఈ చెవులోంచి ఆ చెవిలోకి కొడుతూంటే, అడుగడుక్కు నాలుక పిడచగట్టుకపోతోంది. ఇర్వాటుడయిన తన్ను దినరాజు చురకలు వేస్తోంటే వేలుతెగిన చెప్పు ఈడ్చుకుంటూ కడాకు గమ్యం చేరుకున్నప్పుడు.

"ఇంద మావాఁ, వుత్తరం, ఢిల్లీనుంచి మీ అబ్బాయి రాశాడు" అంటూ పోస్టు కుర్రవాడు శాస్త్రుల్లు అందిచ్చిన కవరు

యెంత హాయి గొల్పిందో ఆ తండ్రికి చెప్పలేం.

మార్గాయాస సంతప్తుడయిన ఓ ముది ప్రాణికి ఓ చలివేంద్రలో, చల్లని, కమ్మని చిక్కని నిమ్మ మజ్జిగ ఓ పెద్ద లోటాడు యిస్తే ఎలా వుంటుంది? అలాగా!

ఎన్నాళ్ళగానో కంట్లో వత్తులు వేసుకుని ఎదురుచూస్తోన్న ఉత్తరం అది. నిజంగా ఈ కారు కుర్రవాళ్ళకి పెద్దతరం వాళ్ళ బాధలు ఏం అర్థం అవుతవి? ఏం నెలకు ఒకఉత్తరం ముక్క. ఇట్లా తనూ, పిల్లలూ కులాసాగా వున్నామని గీకి పారెయ్యడానికి కూడా వీడికి తీరిక లేదు కాబోలు! పైగా దూరాభారాన వున్నాడు కదా!" అనుకుంటూనే వుత్తరం చింపి సులోచనాలు సర్దుకుని చదువుకోడం మొదలుపెట్టాడు ఆదినారాయణ.

"ఇందండి ముందు కాళ్ళు కడుక్కుని, కాస్త దాహం తీర్చుకుని మరీ చదవండి. పాపం, ఎండ దెబ్బన పడివచ్చారు. ఆఁ అబ్బాయి దగ్గర్నుంచేనా వుత్తరం? ఏం రాశాడు? అంతా కులాసాయేనటా? మొన్న మనం బెజవాడ మనిషిచేత పంపిన గోంగూర పండ్ల పచ్చడి, అన్నంలో నున్ని చేరాయటా?" భర్త ప్రయాణ బడలికను గమనిస్తున్నా, కొడుకు రాసిన జాబుపట్ల తనూ తమకం ఆపుకోలేక పోయింది సుభద్రమ్మ.

"నువ్వుండవే, కాస్త నన్ను నింపాదిగా చదవనివ్వు. బడిపిల్లవాడి దస్తూరీలా వుంది వాడి దస్తూరి మరీనూ; నాకు బాగా నడవటంలేదు...." అంటూ చదవడం "స్వగతం"గా ప్రారంభించినా క్రమేణా "ప్రకాశం"గాక తప్పలేదు.

"మహారాజశ్రీ పూజ్యులైన నాన్నగారికి, తమ కుమారుడు శ్రీపతి నమస్కరించి రాయునది...." అంటూ ప్రారంభించి, కుటుంబ విషయాలేవో ప్రస్తావించిన తరువాత, ఈ విధంగా చదువుకున్నాడాయన.

"నేనింత పెద్ద వుద్యోగంలోవున్నా, దేశరాజధాని అయిన ఢిల్లీలోవున్నా, ఒక్కమారూ, నువ్వూ, అమ్మావచ్చి మా దగ్గర పదిరోజుల పాటు వుండలేదు. మేం ఆ ప్రాంతాల్లో వున్నప్పుడు కూడా, ఎప్పుడూ చెప్పుల్లో కాళ్లు పెట్టుకుని వచ్చేవారు. ఇది మాకు చాలా బాధగా వుంది. కాలం ఎంత మారినా, వుద్యోగాలూ, అంతస్థులూ మనసుల్ని ఎంతగా మార్చగలిగినా, రక్త సంబంధపు ప్రేమలూ, మమకారాలూ ఎక్కడికీ పోవని, అంతా తెలిసిన పెద్దవాళ్ళకి మీకు చెప్ప పనిలేదు. అదీ కాక....

పిల్లలెప్పుడూ, తాతయ్య, తాతయ్య, ఎప్పుడువస్తాడు అనివేధిస్తున్నారు. అప్పుడెప్పుడో మీరు కాస్త చెప్పి వదలిన బ్రహ్మరాక్షసి కథ పూర్తి చెయ్యాలట. వేధిస్తున్నారు. అదీ కాక మీ కోడలు అత్తయ్యా, మావయ్యలు కొంతకాలం తమదగ్గర వుంటే ఏదో పెద్ద దిక్కున్నట్టు నిండుగా వుంటుందని, పండుగలూ, వేడుకలూ బాగా సరదాగా జరుగుతవని అంటున్నది. ఇంకా ఢిల్లీలో ప్రతివాళ్ళూ చూడదగినవి అనేకం వున్నాయి కదా? ఇంకా వయసు పైబడి, కదలలేని పరిస్థితి వస్తే ఏం వస్తారు. చూస్తారు? అంచేత తప్పకుండా రావాలని మా వుభయులం మరీ మరీ కోరుతున్నాము.

మరొక ముఖ్య విషయం. రద్దీగావుండే రైళ్ళలో ఇంత దూరాభారం రాలేమని జంకుతారేమో! మీరిద్దరూ హాయిగా, మహరాజులా ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంటులో వచ్చే ఏర్పాటు చేస్తున్నాను. కాలు కింద పెట్టకుండా, పరుపులమీద ప్రయాణం చెయ్యవచ్చు. బెజవాడలో ఉమాపతి అని నా ఫ్రెండ్ వున్నాడు. వాడి కొడుకు "సత్యం" అనే కుర్రాడు, ఇక్కడే చదువుతున్నాడు. సెలవలకు ఇప్పుడక్కడికి వచ్చివున్నాడు. చాకులాంటి కుర్రాడు. అతను మీ టిక్కెట్ల రిజర్వేషన్ చూసుకుని, మీతోపాటేవచ్చి, మీ ప్రయాణం అన్నివిధాలా హాయిగా వుండేట్టు చూస్తాడు. ఫస్ట్‌క్లాసుకు అయితే అవుతుంది ఒహ అయిదు వందలు వెధవ డబ్బు! నాకిదొక లెక్కలోది కాదు. ఎప్పుడూ విమానాల్లో తిరుగుతుండే నాకిదొక పెద్ద విషయం కాదు. అందుచేత మీరుభయులూ మంచిరోజు వగైరా చూసుకుని, ఆ సత్యానికి జాబురాస్తే ఆనాటికి టిక్కెట్లు రిజర్వు చేస్తాడు. సత్యం ఎడ్రసు ఈ దిగువ ఇస్తున్నాను. ఇందు వెంట మీరు ఢిల్లీ రావాలని కోరుతూ మీ కోడలు రాసిన చీటీ





హానికి భయపడేవాడు ఏనాటికీ శ్రీమంతుడు లేడు.

—ఇటాలియన్ సామెత

*  *  *

కష్టకాలంలో బంగారం మసగ మసగ్గా కనబడుతుంది. మంచికాలంలో ఇనుముకూడా మెరుస్తూ కనబడుతుంది.

—చైనా సామెత

*  *  *

యాభై మంది స్నేహితులున్నారా? చాలరు. ఒక్క శత్రువు ఉన్నాడా? చాలా ఎక్కువ.

—ఇటాలియన్ సామెత

*  *  *

మాట మానవత్వం. మౌనం దైవత్వం.

—జర్మన్ సామెత

*  *  *

చెప్పిన మాటను పరీక్షించు. చెప్పిన మనిషిని కాదు.

—అరబ్బీ సామెత

సేకరణ :

ఎం. వి. సుబ్బారావు,
మైనంపాడు

అదృష్టం నిరంతర పరిశ్రమ అడుగు జాడలలో నడచి వస్తుంది.

—గోల్డ్‌స్మిత్

*  *  *

అన్ని మోసాలలోను ఆత్మవంచన అధమాధమం.

—జి. బెయిలీ

*  *  *

గతించినవారికి ఉన్నతాదర్శాలుండేవి. ఆధునికులకు వున్నవి అభిప్రాయములు మాత్రమే.

—హెచ్. హానీ

*  *  *

ఎంతటి బలశాలికైనా మద్యం నిషా ఇస్తుంది. ఎంతటి మంచివాడైనా అధికారం చేతికి చిక్కగానే మారిపోతాడు. అపరిచితమైన అధికారం ప్రాప్తించిననాడు ఎంత విజ్ఞుడైనా అతడ్ని విశ్వసించకూడదు.

—కోల్టన్

సేకరణ :

మహమ్మద్ తాజుద్దీన్, ఆత్మకూరు

కూడా పంపుతున్నాను. చదువుకోవలెను. మీరు ఎప్పుడు వచ్చేది కాస్త వ్యవధిగా నాకు జవాబు రాయవలెను...."

ఆదినారాయణగారి మండువాలోగిలిలో కాల వ్యయానికి వచ్చి కూర్చున్న ఆసాములూ, ఆదినారాయణా, ఆయన భార్యా ముఖాలు చూసుకున్నారు ఈ జాబులోని అద్భుతమైన ఆహ్వానానికి.

ఆనందంతో ఇష్టే అవుతూ, కోడలు కామేశ్వరి రాసిన చీటీ చదవడం మొదలెట్టాడు. ఈ తడవ, బింకంగా, ప్రకాశంగానే చదివాడు.

"పూజ్యులూ, పార్వతీ పరమేశ్వరుల్లాంటి దంపతులూ అయిన, అత్తయ్యా, మావయ్యగార్లకు, కోడలు కామేశ్వరి నమస్కరించి వ్రాయునది : ఇందు వెంట మీ అబ్బాయి మిమ్మల్ని ఢిల్లీ రమ్మనమని రాస్తున్న జాబు చూసుకున్నారుకదా! నేనుకూడా మీ వుభయుల్నీ ఓ నూరు ఇక్కడకువచ్చి మాతోపాటు కొంత కాలం కాలక్షేపంచేసి పోవాలని మరీ మరీ ప్రార్థిస్తున్నాను. శ్రావణమాసం రాబోతుంది. ఇక్కడ అరవవాళ్ళు నోములూ, వ్రతాలూ మిగతా వేడుకలూ బాగా జరుపుకుంటారు. ఎటొచ్చి మన తెలుగువాళ్ళమే తెలిసిన పెద్ద దిక్కులేకపోవడం వల్ల ఏవీ జరుపుకోలేకపోతున్నాము. మీరు దగ్గర వుంటే కొండంత బలం... అంచేత నన్ను మీ సొంత కూతురుగా భావించి తప్పకుండా రావలెను. మీరు హాయిగా, మహారాజుల్లా రావడానికి ఫస్టుక్లాస్ ప్రయాణపు ఏర్పాట్లు కూడా చేస్తున్నాము. మేమూ, పిల్లలం, మీ కోసం ఎదురుచూస్తున్నాము.

కొడుకు రాసిన సంగతులు, ఒహ ఎత్తు అయితే. కోడలు కామేశ్వరి ఆహ్వానం కొండెత్తులావుంది వాళ్ళకు. సంపన్న కుటుంబం నుంచి వచ్చిన కోడలు, తమనిలా హృదయపూర్వకంగా ఆహ్వానించడంతో ఎంతో యిదయిపొయ్యారు యిద్దరూ. జాబు చదవడం ముగించేప్పటికి ఆదినారాయణగొంతు రుద్ధమయింది. కండ్లు ఆర్ద్రమయ్యాయి.

"అమ్మమ్మా అయితే ఢిల్లీ యెలుతున్నాలా? అబ్బో! ఢిల్లీయే? మా బొక్కులో పాటం వుంది అమ్మమ్మా! అక్కల కుతుబ్‌మీనార్, లాలా కిల్లా యింకా యెంచక్కా మంచి మంచి బొమ్మలూ, మిఠాయిలూ వుంటయిట అమ్మమ్మా!" లక్కబొమ్మలాంటి యెదురింటి రామనాధం కూతురుసీత, సుభద్రమ్మ కొంగు పట్టుకుని అబ్బుర పోయించ యింతలేసి కండ్లు చేసుకుని.

"సీతా, ఇట్లా రామ్మా!........" తమ ఆనందాన్ని తన అమాయకత్వంతో ద్విగుణీకృతం చేసిన ఆ పసిదానిపై తమకం ఆపుకోలేక రెండు చేతులూ చాచి ఎత్తుకోడానికి ఆహ్వానించాడు ఆదినారాయణ.

"తాతయ్యా, తాతయ్యా ఢిల్లీ నుంచి నాకేం తెత్తావు తాతయ్యా?" చనువుగా ఆయన చేతుల్లోకి వెడుతూ అంది సీత.

జవసత్వాలను పుంజుకుని, ఎత్తుకున్నాడు ఆ బిడ్డను.

"ఏం కావాలమ్మా నీకు? ఢిల్లీ నుంచి ఏం తెచ్చేది?" గోముగా అన్నాడు.

"పిల్లదాన్ని పదేత్తావియ్యా, ఆదినారాయిణియ్యా, దించు, దించి మాట్లాడవయ్యా!" పక్కనే అరుగుమీద కూర్చున్న రెడ్డెమ్మ హెచ్చరిస్తున్నా లెక్కచెయ్యలేదాయన.

"మరేం, మరేం, తాతయ్యా! మరి.." ఓ క్షణం ఆలోచనలో పడిపోయింది ఆ పసికందు.

"చెప్పమ్మా, చెప్పు!...." బుగ్గను నవరిస్తూ అన్నాడు ఆదినారాయణ.

"మరేం తాతయ్యా, ఒహ రైలు బొమ్మా, మరి ఒహ కుతుబ్‌మీనార్ బొమ్మా తీసుకరండి తాతయ్యా!" తన దృష్టిలో అద్భుతమయిన ఈ రెండు బొమ్మలపై కోరిక కనబరచింది ఆ పిల్ల.

"ఓస్సి ఇంతేనా? ఈ రెండు బొమ్మలేనా? అట్లాగే తీసుకొస్తాంలేవే!" అంది సుభద్రమ్మ. ఆదినారాయణ ప్రతి కలిపాడు పిల్లను కింద దించుతూ.

అంతవరకూ అవకాశం కోసం మధనపడుతోన్న రెడ్డెమ్మ పుంజుకుని అన్నాడు:

"ఇంకా చూత్తావేంవియ్యా, ఆదినారాయణియ్యా! ఉత్తరం ముక్క సదువుతుంటే, సంగతులు సెవిని పడ్డయిలే! పయాణంకట్టండి ఆలూమగలిద్దరూ, యింకా సూత్తారేం! నూటికోటి కొత్తది యినుమంటి శాస్సు! అయినా, పరువుల పెట్టిలోపయాణం సేసిరండి. ఈదేముండది, ఈడ మనూళ్లో, రాళ్ళా గుళ్ళానూ! తెల్లారిలేత్తే నీముకం నేనూ, నా ముకం నువ్వు సూసుకోవడమే గదంటయ్యా? పదండి, పదండి!.... ఏవంటావు శంకరయ్యా?" అంటూ పక్కనే కూర్చున్న రైతును కదిపాడు రెడ్డెమ్మ!

"బోళారెడ్డి వనిపించావు గదయ్యా! ఢిల్లీ అంటే, ఈడుండదనుకుండావేం? ఇన్నూ రావండ దూరవంట! ఎనక కాశీ గోషాయిలు చెబుతుండేవాళ్ళు! లేడికి లేసిందే పరుగా? ఆ పయాణానికి యెన్ని నవుకరియాలు, సద్దుమాట్లూ, మడుసులూ సేసుకోవాలో, మోటో(శ్ళం మనకేం తెలు

త్తది రెడ్డీ?.... అచ్చరేకాని ఆదినారాయణయ్యా. ఢిల్లీ అంటే ఏటనుకుండారు? ఇందర పరస్థం అదే అస్తినాపురం! దరప రాజులు వారు ఏలిన పట్నం అది. ఆడ, ఆయన కూకుని ఏలిన నెమిలిపురి సింహాసనంకూడా వుండదంటయ్యా. అచ్చం బంగారంది. అదురుట్టం మీసబడ్డదిలే. అన్నీ సూసిరండి, కళ్ళారా!" అన్నాడు శంకరయ్య.

"అడ, దెగ్గిర్లో. కురుచ్చేత్రం వుండంటగదియ్యా? కపురవులకి, పాండవులకీ విద్దం జరిగినసోటు? పదేండ్లైనాది మా కక్కాయి పోయిచ్చిండు. వాళ్ళ పిల్లగాడు ఆడ మిల్టరీలో పనిచేత్తోండే! ఆడ నేలంతా, నీయక్క!— ఎర్రడాలుగా వుంటదంటయ్యా. ఎర్రరేగడి మన్ను, మాదిరిగా...." మరో రైతు అంకమ్మ కలుగ చేసుకుని వివరించాడు.

"ఎర్రగా వుండకుండా. మన నల్లరేగడి మన్నులా వుంటుందా అంకమ్మా? అక్కడ పద్దెనిమిది అక్షౌహిణీల సైన్యం చచ్చి రక్తం ఏరులుగా పారింది. ఏమనుకున్నావ్?" అన్నాడు ఎలిమెంటరీ స్కూలు టీచరు చిదంబరం.

"వోడెక్క!" గ్రామీణ ధోరణిలో విస్తుపోయాడు అంకమ్మ.

"ఆడికి దెగ్గిరే. అరిద్వోరం, రుషీకేశం బెమ్మకపాళం కూడా వున్న వంటారు గదయ్యా? అయ్యికూడా సూసిరండి" ఓ ఆసామీ సలహా ఇచ్చాడు

"మరి సూసిరాకుండా వూరికా వత్తారంటయ్యా? ఆడ కొడుకు పేద్ద దొరతనం సేత్తుండాడుగదా? ముసలోళ్ళకి అన్నీ సూపియ్యకుండా వూరికే వంపిత్తాడంటయ్యా?" మరో ఆసామీ!

"తల్లి ముండా మొయ్యా! నాకింకా దొరపుగాకు పైకంసీసేతికి క్కలేదుగానీ, లేకుంటేనా, మీతోబాటువొచ్చిరెండు ఢిల్లీగవిండిగే వెల్ని దోలుకొత్తును!" పెద్దబాలశిక్షకు పైబడి చదువుకుని, ఓ పిసరుజ్ఞానంతనకూ వుందనుకుని అన్నాడు రైతు, రంగన్న.

మన ప్రజలు మహా తెలివిగలవాళ్లు, మహా!...." రాజకీయ నాయకులూ, పాత్రికేయులు. ఢిల్లీలో కూర్చుని అనుకుంటూంటే :—

"ఢిల్లీ ఎక్కడ వుందంటే, అదుగో 'కాశ్మీరు మూలగా' వుందనీ, 'టైమ్ ఎంతయిందంటే, 'జాము', 'రెండుజాములు', పైటేల, సందెకాడ, దొంగపొద్దు యేల, సుక్కపొడుపుయేల' అంటూ సాంకేతికంగా మాత్రమే సూచించగలిగే ఈ కర్మభూమిలోని ఈ నమూనా అమాయక ప్రజలు- "రేత్తిరి పొద్దోయింది కొంపకెల్లి తొంగుందాం పదొంవొ!" అనుకుంటూ నిష్క్రమించారు.

రాత్రి పడుకున్నాడేకాని నిద్ర పట్టలేదు ఏ వేళకూ ఆదినారాయణకు ఎప్పుడు పుట్టేదో తను! ధాత కరువుకు. ఇంతవాట్ట తను. తన హయాంలో అంతా కాలినడకనేగా! గొడ్డు మేతకు కరువయితే ఎన్ని వూళ్ళు తిరిగాడో తను, తన సంగడిగాళ్ళతోనూ, పెద్దవాళ్ళతోనూ! "చినారికట్ల, పెదారికట్ల, మదనంచేడు, కొప్పుటూరు, మాచుటూరు, ఆరేపల్లి, కైతేపల్లి, సిద్దాంతం, రాద్దాంతం....!" ఓ గొలుసుకట్టు పాటలా వుంటుంది తను తిరిగిన వూళ్ళు! అంతా కాలినడకనే! ఆనాడు "గజ్జెలపట్టెడ" కేసుకు, "ఏనుగు" కేసుకు, నాలుగావిడవున్న మేజిస్ట్రేటు కోర్టుకు ఎన్ని వాయిదాలకు తిరిగాడు తను- కాలినడకను! అప్పుడిన్ని రైళ్లాపాడా? పగలు పన్నెండు గంటల బండీ రాత్రి త్రూమేలూనూ!

ఏమయినా ఆ కాలం గతించింది. తరం మారింది. తను దంపతుల పుణ్యమా అని పతి కలిగాడు. ఒకడే అయితేనేం? రత్నం! "కుల ముద్ధరింప నొక్కడె, కసవూడ్చిన చింపిరాలు గంపెడేలా?" అన్నాడు కవి. వాణ్ణి చదువులో ప్రవేశ పెట్టినప్పటినుంచి చాకులా పైకివచ్చాడు.

అయినా మళ్ళా ఆలోచన వచ్చింది ఆదినారాయణకు. చిన్నతనంలో వాడికి వచ్చిన గోరాలా, గోరాలా! అసలు బతుకుతాడనుకున్నాడూ తను! భుజం మీద యెక్కించుకుని యెన్ని గడపలు నొక్కి యెందరెందరు వైద్యులకు చూపించాడో తను! ఎన్ని చెట్లచుట్టూ తిరిగి, యెన్ని పుట్టలకు మొక్కిందో తన భార్య!

అట్లా దక్కించుకున్న తమ బిడ్డ, తమ మీద అభిమానంతో వుండి, ఇప్పుడిట్లా ఢిల్లీకి వరుపుల పెట్టె మీదుగా ప్రయాణం చేస్తూ రండి రండి. అంటూ పదే పదే పిలుస్తున్నాడంటే వింత ఏవుంటుంది గనక! వాడి కడుపు చల్లగా....!

ఆదినారాయణకు ఆలోచనల్లోనే కూరుకు పట్టిపోయింది.

* * *

"ఏమేవ్ జాబు రాస్తున్నా, అబ్బాయికి. రేపు మాణాయ పక్షాలు వెళ్లాక బయల్దేరి వస్తున్నామని తిధి వార, వర్జ్య, నక్షత్రాలన్నీ చూసి పకడ్బందీచేసి రాస్తున్నానే!"

ఓమారు— ప్రధమతహా తన జీవితంలో బింకంగా, గర్వంగా, 'బస్తీమీద సవాల్!' అంటూ భార్యకేసిచూసి.

"ఏమేవ్ అట్లా చూస్తావ్? ఆదినారాయణంటే ఏవనుకున్నావ్? అట్లాటప్పయ్య


# శుభవార్త

డాక్టర్లకు సాధ్యముకాక వదిలివేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. లావుపాటివారు సన్నగను బలహీనులను బలవంతులుగను చేయబడుదురు. మధుమేహము, రక్తపుపోటు, కుష్ఠు, బొలి, క్యాన్సరు, సంతానం లేనివారుకూడా శ్రీ యోగిగారి కాయకల్ప చికిత్సవలన సంపూర్ణ ఫలితము పొందగలరు. ఈ చికిత్సవలన దేహములోని అన్ని వ్యాధులు తొలగిపోవుటయేగాక నూతన యవ్వనము కలుగును. వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రు. 4—00లు యం. ఓ. పంపవలయును.

మేనేజర్.

శ్రీ యోగాశ్రమ్,

పెదవాల్తేరు P. O., విశాఖపట్టణము-17.

INSTITUTE of B.A/B Com.. Entrance. CORRESPONDENCE COURSES / ORAL (College)

Those who complete 20 years are directly eligible for the courses.

Contact :
C/o ARUNA TYPE INSTITUTE,
Door No 30-6-1,
Near Premasamajam,
VISAKHAPATNAM—4,

Prospectous : in person Rs.3/- by M. O or D. D. Rs. 3-50

మన్నికకు ప్రసిద్ధిచెందినవి.
అశోకాపెన్స్ & బాల్‌పెన్నులు
REGD.No.143646
అశోకా పాళీలు
లాంగ్ లైఫ్ పాయింట్లతో
తయారుచేయబడుచున్నవి.
అశోకాపెన్‌వర్క్సు, తెనాలి. (ఆంధ్ర)

తెల్ల వెంట్రుకలు
హెయిర్‌డై ద్వారాకాదు. మా సెంటెడ్ ఆయుర్వేదిక్ మన్ మోహిని హెయిర్ ఆయిల్ మీ వెంట్రుకలను శాశ్వతముగా ప్రకృతి సిద్ధమైన నల్లరంగు నిస్తుంది. ఆలోచనతో పనిచేసేవారి పాలిటి వరం.
ధర రు. 12/—
ఫుల్ కోర్సు రు. 31/—
JANATA AYURVED BHAWAN
(P) P.O. Lalbigha (Gaya)

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!

హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవపర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యంచేయబడును.
వరిబీజము(బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ-రండి.
డా॥ దేవర, ఫోన్ 551,
మార్కండే గుడివద్ద, తెనాలి.
బ్రాంచి : 26. నార్త్ బోగ్‌రోడ్, మద్రాసు-17

అనుకున్నావా యేం? ఢిల్లీలో కలెక్టరు దొర హోదాలో వున్న శ్రీ గిరిరాజు శ్రీపతిని కన్న తండ్రే! హఁ! హఁ! ఢిల్లీ నుంచి మాంచి ఉన్ని చలికోట్లు ఒహ డజను పట్టుకొచ్చుకుంటాను! బంగారం పోతపోసిన కళ్ళద్దాలు ఫ్రేములు తెచ్చుకుంటాను! మంచి ఢిల్లీ చెప్పులు ఒక జత తెచ్చుకుంటాను. మరి కలెక్టరు దొరవారిని కన్నతల్లీ! నువ్వేం తెచ్చుకుంటావో చెప్పు!" అంటూ వృద్ధ బాలుడిలా అల్లరిగా అనగలిగాడాయన ఈనాటికి.

"చాల్లెండి! ఏం మరీ పసివాళ్ళయిపోయారు?" అంటూ మెత్తగా నోటి చురక వేసింది సుభద్రమ్మ భర్తకు.

"శ్రీరస్తు, శుభమస్తు, అవిఘ్నమస్తు" అనుకుంటూ పసుపురాసిన రెండు కవర్లు తీసి, తామెప్పుడు బయలుదేరి వస్తున్నదీ అటు బెజవాడలో సత్యం అనేకుర్రవాడికి, ఇటు తన కొడుక్కూ చక్కని వక్కాణంతో రాయడం ప్రారంభించాడు ఆదినారాయణ.

* * *

ఆనాడు రానే వచ్చింది!

వాకిట్లో స్టేషనుకు బయలుదేరడానికి జోడెద్దుల బండి సిద్ధంగా వుంది. వెనక తమకు మూడెకరాల వ్యవసాయం వున్నపుడు తమకు "పాలిగ" చేసిన పాలేటి వెంకటపతి మనవడి బండి అది. మెడకు గజ్జెల పటెడ, నవుడ్రకు యెర్ర కుచ్చుల పటెళ్ళలో అదిరిపోతేవాలు, ఆమడదూరం "పేరం"లోతే మంచి ఒంగోలు కోడెకు సమహరిస్తున ఎండ తగలని గూడుబండి అది.

మరిచెంబుతో నీళ్ళు పట్టుకుని, ఏనాటిదో కోటు వేసుకుని, దానిపై మాంచి వుత్తరీయం పల్లెవాటువేసుకుని కదిలాడు, ఆదినారాయణ ఆయన పక్కనే చేరెడు కుంకుమ పెట్టుకుని, చిలక పచ్చరంగు నేత చీరె కట్టుకుని, కాళ్ళకు కడియాలతో, అరముగ్గిన పండువంటి సుభద్రమ్మ బయలుదేరింది - ఆదిలక్ష్మిలా!

"మంచి 'సహనం' అవుతున్నదేమోఁ చూడు, బాలబ్బాయీ!" అంటూ పక్కన వున్న బ్రాహ్మణ కుర్రాడికి పురమాయించాడు ఆదినారాయణ.

"సకినానికేం, బాగానే వుంటది లేవయ్యా; కదలండి, కదలండి, పొద్దు నెత్తిమీద కొత్తుండది; గొడ్డుకు దప్పిక కొడుతుంది. ఆడ సంబోళ్ళ బజారు తప్పించి పోదాంలే, పదండి, పదండి!" అంటూ తొందరజేశాడు బండి తాలూకు ఓ ఆసామీ.

కాని, ఆదినారాయణకు మాంచి "సహినం" చూసిపోవడంలో వల్లమాలిన నమ్మకం.

"ఒకక్షణం చూద్దాం. ఇంతలో వర్జ్యం ఘడియలుకూడా బాగా వెళ్ళిపోతాయి. లేకపోతే అదుగో అక్కడ వున్నయ్య కూతురు, కన్నె ముత్తైదు, లక్ష్మివుంది. దాన్ని కాస్త అట్లా యెదురుగా రమ్మనమని చెప్తాదాం. నువ్వు చెప్పబ్బాయి శాస్త్రుల్లూ!" అంటూ తను తూర్పుగా చెయ్యెడ్డ మెట్టుకుని తేరిపార చూశాడు ఆదినారాయణ. ఆయన చూస్తోన్న వేపే చూశాడు టపా కుర్రాడు, శాస్త్రుల్లూనూ!

'అరె! ఎవరో కొత్తమనిషి వస్తున్నాడే! యెవరో అబ్బాయి!' శాస్త్రుల్లు వింతగా చూస్తూ అన్నాడు.

"ఎవర్రా, ఎవరొస్తున్నారు? ఒంటి బ్రాంభడా?" అసహనంగా అన్నాడు, ఆదినారాయణ, తనూ, ఆవేపే చూస్తూ.

"ఔను, ఎవరో చెకచెకానడిచి వస్తున్నారు - కుర్రాడిలానే వున్నాడు- చేతులో న్యూస్ పేపరూ, తనూను."

ఆ కుర్రాడు, చెకాచెకావచ్చేసి, వాకిట్లో వున్న వాళ్ళకేసి చూసి," శ్రీ గిరిరాజా ఆదినారాయణగారిల్లు ఇదేనాండి?" అని అడిగాడు, ఆదుర్దాగా.

"ఔనబ్బాయి. ఇదే. నేనే ఆదినారాయణ్ణు! ఏవూరబ్బాయి నీది?" ఆయనకూడా హడావిడిగా అడిగాడు.

"అదేంటి తాతయ్యా నన్ను గుర్తుపట్టలేదా? నేను ఉమాపతి కొడుకును. సత్యాన్ని విజయవాడకమూ మాది? అప్సరే కాని మీరు ఢిల్లీ ప్రయాణం పెట్టుకుని నిన్న విజయవాడకు రావలసింది. రాలేదేంటి తాతయ్యా? మీకోసం మేమంతా ఎంత ఆదుర్దా హైరాన పడిపోయామో చెప్పలేము. రాత్రి జి టి. టైము మూడింటి వరకు చూసి చూసి, ఏమయిందో ఏమోనని తెల్లవారగట్ల బండికి బయలుదేరి వచ్చేశాను. అయినా మీరు రాలేదేంటి? ఏవఁయింది?" అంటూ పిడుగులాంటి ప్రశ్న వేశాడు.

"యేం టబ్బాయి, నువ్వనేది? నిన్న రావడమేవిఁటి? మూడోతారీకు, శుక్రవారం ఇవ్వాళేకదా? మూడోతేదీ రాత్రి అంటే, పంచమినాడు రాత్రి బండికిగదా వెళ్ళవలసింది? నువ్వూ అట్లాగే రాశావు కదా అబ్బాయ్?...." కళవళపడుతూ, అడిగాడు ఆదినారాయణ. విజమాకిడినట్లు, విస్తుపోయ్యారు, చుట్టూవున్న జనం. యిదేందో పెద్ద తిరుగడయిందనుకుంటూ.

"మూడో తేదీ అంటే నిన్న రాత్రి పన్నెండు గంటల తరువాతనుంచీ మూడో

## బాల గోపాలం



ఫొటో : జవ్వాది. నిడదవోలు

## బాల పాటలు

నవ్వులు నవ్వులు
ఒకటే నవ్వులు
కడుపునిండిన
పాప నవ్వులు
కిలకిల నవ్వులు.

— డాక్టరు పి. తిరుమలరావు
లండన్

తేదీయే గదాండీ? ఈ మాత్రం ఈ ఫూళ్లో ఎవరికీ తెలీకపోయిందా? రైల్వే కాలమానం అంటూ చిన్న పిల్లలకు కూడా తెలుస్తుందే?" ఎద్దేవగా అన్నాడు కుర్రాడు.

"రైల్వే కాలమానం కాదు తంగేళ్ళ ఒడ్డున తెంచు. అయినా వారం జొరబడేది తెల్లవారితేనేగదా? శుక్రవారం అ.o చే. ఇవ్వాళ తెల్లవారితేనేకదా ప్రవేశించేది? బస్తీల్లో వుండే పిల్లలు, చకుముకి రాళ్ళ లాంటి పిల్లలుంటారు. ఈ విషయం తెలీదా అబ్బాయీ?" నైరాశ్య ప్రేరితమయిన క్రోధం, ఎంత తమాయించుకున్నా బయటపడక తప్పిందికాదు ఆదినారాయణకు.

"గద్దదే సరైన మాట! సూరియోదయం అయిన తరవాతే గదంటబ్బాయి. వారం జొరబడేది? సదువుకున్నోళ్ళకి యింత మాత్తరం తెలవదా? హి....హి....హి..." ఓ గ్రామీణుడు వికటంగా నవ్వాడు.

"ఇంగిలీసు సదువులు యింతేలేవియ్యా ప్రయోజనం మాలినయి.. హి.. హి.." మరో హహ శ్రుతికలిపాడు.

సత్యం ఓమారు జుగుప్సగా చూశాడు వాళ్ళవేపు.

"అయిండేదో అయిపోయింది. తాతయ్యా! మరేం పరవాలేదు. మీ ప్రయాణం ఎట్లాగయినా జరిగి తీరుతుంది. నేను మిమ్మల్నిద్దరినీ, ఫస్టు క్లాసులో తీసుకవెళ్ళి, మీ కొడుకు ఇంట్లో దించి తీసుకొస్తాను. మీ టిక్కెట్లు వాపసు యిచ్చి, డబ్బు తీసుకున్నాను. ఈ సారి ఇట్లాంటి తికమకలకు తావులేకుండా, సరిగ్గా పూర్తిగా వివరాలతో నాకు జాబురాయండి. కావలసినవివరాలు, యిదిగో ఈ చీటీలో వున్నవి. వాటి ప్రకారం రాయండి ఇక వస్తాను. నేను మళ్ళీ బండికి వెళ్ళాలి" అంటూ వెనక్కు తిరిగాడు.

పశ్చాత్తప్తుడయిన ఆదినారాయణ ఎంత వారించినా, వినకుండా వెళ్ళిపొయ్యాడు.

*　　*　　*

ఈసారి, ప్రయాణంచేసే తేదీ, వారం, టయిమూ, తాము ఇక్కడ ఎప్పుడు బయలుదేరి వచ్చేది.... అన్ని వివరాలు, అన్ని తప్సీళ్ళతో రాసి పోస్టుబాక్సులో జాబు పడేయించాడు బెజవాడ సత్యానికి ఆదినారాయణ. జాబు అట్లా పంపేడో లేదో కాస్తుష్ట, "ఇందమావాం ఉత్తరం, ఢిల్లీ నుంచి...." అంటూ జాబు అందించి పొయ్యాడు.

తమకంగా జాబు అందుకుని, సులోచనాలు సర్దుకుని చదువుకున్నాడు. ఆ జాబు "పర్పోర్టు" ఇది :

"ఒహ సంతోషమైన వార్త! నాకు మొన్ననే బదిలీ ఆర్డర్లు వచ్చాయి. విజయవాడకు గవర్నమెంట్ కంపెనీ డైరెక్టరుగా నన్ను వేశారు. ఇన్నాళ్ళు మీకు వెయ్యి మైళ్ళ దూరంగా వున్న మేము మీ తావుకు వస్తున్నాం. మీ కోడలు, పిల్లలు కూడా ఈ వార్త విని సంతోషపడ్డారు. అందుచేత మీకు యిక్కడకు వచ్చే ప్రయాస తప్పింది. రెండు మూడు రోజులలో బయలుదేరి వస్తున్నాను. నెమ్మదిమీద ఫామిలీని తీసుకువస్తాను...."

ఈ జాబు చదువుకుని ఇస్తై అయిపోయాడు ఆదినారాయణ భార్య సుభద్రమ్మకుకూడా చదివివినిపించాడు. వాళ్ళ కళ్ళలో అప్పుడే నీళ్ళు నిలిచాయి- అవి ఆనంద బాష్పాలా?.

ఇద్దరు ముగ్గురు గ్రామీణులు కూడా విన్నారు ఈ జాబు చదువుతూండగా.

ఎవరికి ఎలా రియాక్టు కావాలో పాలుపోలేదు. ఢిల్లీ ప్రయాణపు మూటలు, డబ్బాలు, జాకీలు, మరచెంబులూ, పాతకాలపు కోట్లు, ఏవేవో ప్రశ్నిస్తూ కనిపించాయి.

దూరాన, ఆకం చెరువు గట్టుమీదవున్న పచ్చిరిచెట్టు తరాలనాటిదితన్నెందుకో పిలిచినట్లయింది!

"అట్లా వెళ్ళివస్తాను, ఆకం చెరువు దాకా, కాసిన్ని మొక్కజొన్న పొత్తులు కొనుక్కువస్తాను" అంటూ ఏదో కాల్పనిక ఆలోచనతో, కాల్పనిక శక్తితో బయలుదేరాడు ఆదినారాయణ, కర్రా, చెప్పులూ, బయటకుతీసి.

"ఆకం చెరువా? కానా దూరంకదండీ" సుభద్రమ్మ విస్తుపోతూ అంది.

"ఎంతే? రెండడుగులు గదుటే. ఇప్పుడే, ఇక్కడున్నట్లే వస్తాగా?" అంటూ బయలుదేరాడు ఆదినారాయణ.

"తాతయ్యోయ్, ఢిల్లీలో కుతుబ్ మినార్ బొమ్మ కొనుక్కులావడం మరచిపోకండేం?" అటువేపుగా చెంగున గంతేస్తూ వెడుతోన్న రామనాధం కూతురు సీత గుర్తు చేస్తూంది, ఆదినారాయణకు.... వేదాంతిలా నవ్వుకుని, చకచకా బయలుదేరాడాయన. ★

ఇంటింటికీ
ఆనందజ్యోతి
ఆనందజ్యోతి
సచిత్ర వారపత్రిక
త్వరలో...
కొత్త సీరియల్స్
సీరియల్-1
అందగాడు
రచయిత్రి:
మాదిరెడ్డి సులోచన
సీరియల్-2
మేలుకొలుపు
రచయిత:
చివుకుల పురుషోత్తం
ఇంకా మీకు నచ్చే
ఎన్నో శీర్షికలు.
ఏజెంట్లు లేనిచోట
ఏజెంట్లు కావలెను.
ఆనందజ్యోతి
P.B.NO.387. చెట్ల బజారు.
గవర్నరుపేట, విజయవాడ-2.
DESIGNERS
SIMPLE